క్లుప్తంగా

అమ్మవార్లకు పసుపు, కుంకుమల సమర్పణ



అమ్మవార్లను ఊరేగింపుగా తీసుకువస్తున్న పూజారి

తగరపువలస: ఆనందపురం మండలం పందలపాక పంచాయతీలో అమ్మవార్లకు గ్రామస్తులు మంగళవారం పసుపు, కుంకుమలు సమర్పించారు. పూజారి గ్రామంలో నుంచి బంగారమ్మ, కేతాళమ్మ, ముత్యాలమ్మలను ఆలయాల వరకు ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. పంచాయతీలో బాణసంచా, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు.

విద్యార్థులకు అందని బూట్లు

తగరపువలస: కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా అందించాల్సిన బూట్లు ఇప్పటి వరకు పాఠశాలలకు చేరలేదు. పాఠశాలలు పునఃప్రారంభించి ఇప్పటికే మూడు వారాలు అవుతుంది. దీంతో బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు కాళ్లకు ఎలాంటి ఆచ్ఛాదన లేకుండా, ఒట్టి కాళ్లతో పాఠశాలలకు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి సరఫరా అయిన బూట్లు ఎంఆర్‌సీ భవనాలలో ఉండిపోయాయని, వీటిని వెంటనే విద్యార్థులకు పంపిణీ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణంపై ఫిర్యాదు

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీలో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని గంధవరపు ఉష అనే మహిళ పంచాయతీ కార్యదర్శికి మంగళవారం ఫిర్యాదు చేశారు. పంచాయతీలో జీ ప్లస్ 2 వరకే అనుమతులు ఉన్నాయని, రాయిప్పాలెం 8వ వార్డు సర్వే నంబర్ 4/1లో చేపడుతున్న అనధికారి బహుళ అంతస్తుల భవనం అనుమతులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఈ ఫిర్యాదులో కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

తగరపువలస: చిట్టివలస(తగరపువలస) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి గాను ఆరు కోర్సులు (మేథమెటిక్స్–కెమిస్ట్రీ, బోటనీ–జువాలజీ, జువాలజీ–బోటనీ, కెమిస్ట్రీ–కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్–కామర్స్, హిస్టరీ–పొలిటికల్ సైన్స్ విభాగాలలో) ప్రవేశాలకు సంప్రదించాలని ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి మంగళవారం కోరారు. త్వరలో ప్రవేశాలు జరుగనున్న ఈ కోర్సులలో చేరే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్టు తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో క్రమశిక్షణ, నాణ్యమైన విద్య, సత్ప్రవర్తనకు కళాశాల ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కళాశాలలో ప్రవేశాల కోసం అధ్యాపకులు బి.సీతన్నాయుడు (89788 83125), ఎ.విజయలక్ష్మి (85229 75829) లను సంప్రదించాలని కోరారు.

ఆయాలకు 4 నెలలుగా అందని జీతాలు

తగరపువలస: ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఆయాలకు 4 మాసాలుగా జీతాలు అందక అవస్థలు పడుతున్నారు. వీరంతా పాఠశాలల్లో వాష్‌రూమ్‌లు, ఆవరణ, తరగతి గదులు శుభ్రం చేయడంతో పాటు తాగునీరు తీసుకు వస్తుంటారు. అదనంగా ఉపాధ్యాయులకు సహాయకులుగా ఉంటూ, వారు చెప్పిన పనులు నిర్వహిస్తుంటారు. ఇందుకు గాను ఒక్కొక్కరికి నెలకు రూ.6 వేల జీతం ఇవ్వవలసి ఉంటుంది. ఇంత తక్కువ జీతంతో కుటుంబాలకు పోషించుకునే వారికి నాలుగు మాసాలుగా అంటే ఈ ఏడాది మార్చి నుంచి ప్రభుత్వం జీతాలు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వీరితో పాటు పాఠశాలల్లో కాపలాదారులకు కూడా నాలుగు మాసాలుగా జీతాలు విడుదల కాలేదు.

మందుబాబులకు రూ.3 లక్షల జరిమానా

తగరపువలస: ఆనందపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 30 మందికి భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ పి.స్వాతిభవాని మంగళవారం జరిమానా విధించారు. 30 మంది నుంచి రూ.10వేలు వంతున రూ.3 లక్షలు వసూలు చేసినట్టు ట్రాఫిక్ సిబ్బంది తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని ఈ సందర్భంగా హితవు పలికారు.

పచ్చదనం పరిఢవిల్లేలా..



● 'మిషన్ గ్రీన్ భీమిలి' యజ్ఞం

- వేలల్లో విత్తన బంతుల తయారీ
- సౌమ్యగిరి పరిసరాలు హరితమయం
- నేవీ సహకారంతో మరింత విస్తృతం

ప్రకృతి పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యం. పచ్చదనాన్ని పెంపొందించుకుంటేనే కాలుష్యానికి చెక్ పెట్టగలం. మొక్కలను పెంచడం, వాటిని పరిరక్షించడం ద్వారానే దీనిని సాకారం చేసుకోగలం. అందుకే విస్తృతంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టేందుకు నడుం బిగించింది 'మిషన్ గ్రీన్ భీమిలి'. ఈ బృహత్ యజ్ఞానికి 2021లో శ్రీకారం చుట్టిన ఈ సంస్థ వేలలో విత్తనబంతులను రూపొందించి, సౌమ్యగిరి పరిసర ప్రాంతాలను హరితమయం చేస్తోంది.



కొండపై చల్లే పలు రకాల విత్తనాలు, విద్యార్థులు తయారు చేసిన విత్తన బంతులు

భీమునిపట్నం: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని భావించి ఆ దిశగా అడుగులు వేస్తోంది మిషన్ గ్రీన్ భీమిలి సంస్థ. ఎంత ఎక్కువగా మొక్కలు నాటితే పర్యావరణం అంత పదిలంగా ఉంటుందని సంకల్పించి, అందుకు నర్సింహస్వామి కొలువైన విశాలమైన సౌమ్యగిరిని ఎంపిక చేసుకున్నారు.

వేలల్లో విత్తన బంతుల తయారీ

ఈ కొండపై చెట్లు పెరిగితే అన్ని విధాలుగా బాగుంటుందని పెద్ద ఎత్తున విత్తనాలను చల్లడానికి నిర్ణయించారు. అందులో భాగంగా తొలి విడతగా 25 వేల విత్తనాల బంతులు (సీడ్ బాల్స్)ను తయారు చేశారు. ఇందుకు భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్ద ఉన్న సన్‌స్కూల్ విద్యార్థులు తమ సహకారాన్ని అందిస్తున్నారు. వారు ఈ విత్తన బంతులను తయారు చేస్తున్నారు. ఇందులో చింత, నేరేడు, కానుగ, మామిడి, రేల, వేప, మద్రి, రావి మొదలైన వాటితో కలిపి మొత్తం 32రకాలకు సంబంధించిన విత్తనాలతో వీటిని తయారు చేస్తున్నారు. వాటిని సంస్థ సభ్యులు వర్షాలు పడే సమయంలో కొండపైకి వెళ్లి, వివిధ ప్రాంతాల్లో చల్లుతున్నారు. ఇదే పద్ధతిలో ఈ నాలుగు సంవత్సరాల్లో ఇప్పటివరకు సుమారు 4.50 లక్షల విత్తనాలు చల్లారు. దీంతో అన్ని ప్రాంతాల్లో విరివిగా మొక్కలు పెరుగుతున్నాయి.

మియావాకి విధానంలో పెంపకం

జపాన్ దేశంలో తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలను పెంచే మియావాకి విధానాన్ని కూడా వీరు చేపట్టారు. అందులో భాగంగా ఇక్కడ కృష్ణాకాలనీ కొండపైనున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం పక్కనే 20 సెంట్ల స్థలాన్ని ఎంపిక చేశారు. ఇందులో 42 జాతులకు చెందిన 740 మొక్కలను వేసి, ఎక్కువ నీటిని తీసుకునే విధానం ద్వారా పెంచుతున్నారు. ఇలా చేయడం వల్ల అయిదు సంవత్సరాల్లో పెరగవలసిన మొక్క ఒక సంవత్సరంలోనే పెరుగుతుంది. ఇలా పర్యావరణాన్ని కాపాడడం కోసం వీరు చేపట్టిన ఈ మంచి ప్రయత్నానికి చాలా మంది సహకారం అందిస్తున్నారు, దీంతో ఈ కార్యక్రమం చక్కగా సాగుతోంది.



కృష్ణాకాలనీ కొండపై వేసిన మియావాకి తోట



విత్తన బంతులను తయారు చేస్తున్న సన్‌స్కూల్ విద్యార్థులు

నేవీ సహకారం



హెలికాప్టర్ ద్వారా విత్తనాలను చల్లేందుకు తీసుకువెళ్తున్న నేవీ సిబ్బంది

మిషన్ గ్రీన్ భీమిలి సంస్థ చేపట్టిన ఈ కార్యక్రమం గురించి తెలుసుకున్న ఐఎన్ఎస్ కళింగ తమ సహకారం అందించేందుకు ముందుకు వచ్చింది. అందులో భాగంగా హెలికాప్టర్ ద్వారా విత్తన బంతులను చల్లడానికి సహకరిస్తోంది. ఆ విధంగా గతేడాది 85వేల సీడ్ బాల్స్ ద్వారా కోటి విత్తనాలను ఈ కొండ చుట్టూ చల్లారు. దీంతో లక్షలాది మొక్కలు కొండ చుట్టూ మొలుస్తున్నాయి. ఇప్పుడు వర్షాకాలం కావడంతో గత నెలలో 75వేల విత్తనాలను కొండ వద్ద చల్లారు.

మొక్కలు నాటడం అత్యవసరం



ఇష్టానుసారం చెట్లను నరికివేస్తుండడంతో పర్యావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల వల్ల వర్షాలు ఆశించిన విధంగా పడటం లేదు. ఈ పరిస్థితుల్లో అందరూ తప్పనిసరిగా మొక్కలను నాటవలసిన అవసరముంది. ఈ కారణం వల్లే విత్తనాలను భారీగా చల్లే కార్యక్రమాన్ని చేపట్టాం. మా ఈ సంకల్పానికి అందరూ ఇస్తున్న సహకారం మరువలేనిది.

– ముమ్మిడిశెట్టి ఆదిత్య, మిషన్ గ్రీన్ భీమిలి నిర్వాహకుడు

నిరంతరం కొనసాగిస్తాం



ఈ కొండ ప్రాంతంలో విత్తనాలు చల్లే కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించడానికి నిర్ణయించాం. అందులో భాగంగా కొండపైనే అనేక ప్రాంతాలను ఎంపిక చేసుకుని ఆమేరకు విత్తనాలను చల్లుతున్నాం. నేవీ వారు కూడా ముందుకు రావడంతో వారి సహకారంతో మరింత ఎక్కువ మొత్తంలో విత్తనాలు చల్లే కార్యక్రమాన్ని చేపట్టనున్నాం.

– గుల్లల వెంకటేష్, మిషన్ గ్రీన్ భీమిలి నిర్వాహకుడు

నరసింహావతారంలో జగన్నాథుడు



భీమిలిలో జరుగుతున్న జగన్నాథ స్వామి రథోత్సవాల్లో భాగంగా స్వామి మంగళవారం నరసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.సింగరాచార్యులు ప్రత్యేక పూజలను నిర్వహించి, అవతార విశిష్టతను భక్తులకు వివరించారు.

– భీమునిపట్నం

ఆర్థిక అక్షరాస్యతపై గ్రామీణులకు అవగాహన



అయినాడలో మాట్లాడుతున్న ఎస్‌బీఐ ఏజీఎం వెంకటరావు

పద్మనాభం: ఆర్థిక అక్షరాస్యతపై గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం ఆధ్వర్యంలో మూడు నెలల పాటు చేపట్టనున్న ఈ కార్యక్రమాన్ని మంగళవారం అయినాడ పంచాయతీలో నిర్వహించారు. ఎస్‌బీఐ రెడ్డిపల్లి బ్రాంచ్ ఆధ్వర్యంలో కార్యక్రమంలో ఏజీఎం పి.టి.వెంకటరావు మాట్లాడుతూ పొదుపు, బీమా, కేంద్ర ప్రభుత్వ పథకాలు, బ్యాంకులు ఖాతాదారులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. ఖాతాదారుల సందేహాలను నివృత్తి చేశారు. అంతకు ముందు దీనికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ కార్యాలయంలో ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌తో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం ఎం.శ్రీనివాస్, బ్యాంకు అధికారులు, డీఆర్‌డీఏ సిబ్బంది, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లీలావతి, పంచాయతీకి చెందిన 60 మంది పాల్గొన్నారు.

4న దుర్గాలమ్మ ఆలయంలో శాకాంబరి ఉత్సవాలు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో 4వ తేదీ శుక్రవారం శాకాంబరీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు పిల్లా సూరిబాబు తెలిపారు. ఆలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భక్తులు సమకూర్చిన పలురకాల కూరగాయలు, పండ్లు, ఆకు కూరలతో అమ్మవారికి అలంకరణ చేస్తామన్నారు. శుక్రవారం ఉదయం శాకాంబరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తారన్నారు. అమ్మవారికి సారె సమర్పణ ఉంటుందని, ఉదయం 10గంటలకు చంద్రంపాలెం గ్రామం నుంచి సారె ఊరేగింపు ప్రారంభం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి నాగోతి తాతారావు, కోశాధికారి పిల్లా శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పోతిన శివ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు సూరిబాబు

అల్లూరి జయంతిని విజయవంతం చేయాలి

పద్మనాభం: పాండ్రంగిలో ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్న అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. మండలంలోని పాండ్రంగిలో అల్లూరి జయంతిపై మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పరంగా నిర్వహించనున్న ఈ ఉత్సవానికి అందరు సహకరించాలని కోరారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. సమావేశంలో జిల్లా పర్యాటక శాఖ మేనేజర్ జె.మాధవి, మాజీ ఎమ్మెల్యే ఆర్ఎస్‌డీపీ అప్పలనర్సింహరాజు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మొక్కలు నాటి, సంరక్షించాలి



మధురవాడ పీఏసీఎస్ వద్ద మొక్కలు నాటుతున్న అధికారులు, నాయకులు

మధురవాడ: పర్యావరణ పరిరక్షణలో మొక్కలు అత్యంత ముఖ్యపాత్ర పోషిస్తాయని మధురవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పర్సన్ ఇన్‌చార్జి ఎం.రమేష్‌బాబు అన్నారు. మొక్కలు నాటి పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 103వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఇక్కడ విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను మరింత సమర్థవంతంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కో–ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కేఎస్‌వీజీ ప్రసాద్, సంఘ సీఈవో ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ డైరెక్టర్లు, సభ్యులు పోతిన యల్లంనాయుడు, నాగోతి సూర్యప్రకాశరావు, పోతిన ప్రసాద్, పిల్లా రాము, పీఎంఎస్ కృష్ణ, నాగోతి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు విశేష అలంకరణలు



డ్రాగన్, పైనాపిల్ అలంకరణలో రాస పోలమాంబ

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామ దేవత రాస పోలమాంబ అమ్మవారిని మంగళవారం ఆలయ కమిటీ ప్రతినిధులు 111వ అలంకరణలో భాగంగా డ్రాగన్, పైనాపిల్ పండ్లు, పువ్వులు, గజమాలలతో అలంకరించారు. వారాహి నవరాత్రుల సందర్భంగా ఈ ప్రత్యేక అలంకరణ చేసినట్టు తెలిపారు. లక్ష్మీపురం పంచాయతీకి చెందిన బోని శ్రీనివాస్, రాజేశ్వరి, హేమచంద్ర మణికంత ఈ అలంకరణకు సహకారం అందించారు. భీమిలి మండలం చిప్పాడ దివీస్ రోడ్డులోని మద్దిపేట వద్ద గుడివాడ గ్రామదేవతలు తోగాలమ్మ, ముత్యాలమ్మలను ఆలయ కమిటీ ప్రతినిధులు థర్మాకోల్ షీట్లపై వివిధ డిజైన్‌లు, పువ్వులతో అలంకరించారు.



థర్మాకోల్ షీట్లతో తోగాలమ్మకు అలంకరణ

పచ్చిరొట్టతో భూసారం మెరుగు

తగరపువలస: వేసవి దుక్కుల అనంతరం పచ్చిరొట్ట విత్తనాలు వేయడం ద్వారా మొక్కలకు పోషకాలు అంది, అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి కొత్తూరు అప్పలస్వామి అన్నారు. భీమిలి మండలం టి.నగరపాలెం, తాళ్లవలస గ్రామ పంచాయతీలలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. మట్టి నమూనాల సేకరణ, వాటి ఆవశ్యకత సేకరించే విధానం, ఫలితాలకు అనుగుణంగా ఎరువుల వినియోగం గురించి తెలియజేశారు. ఈ సీజన్‌లో వ్యవసాయశాఖ 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు, కిలోకు 5 రాయితీలో వరి, వేరుశనగ విత్తనాలు అందించినట్టు తెలిపారు. ఇప్పటి వరకు పీఎం కిసాన్ రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోకపోతే రైతుసేవా కేంద్రంలోని సిబ్బంది ద్వారా నమోదు చేయించుకోవాలన్నారు. నమోదు కాని రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వ్యవసాయ ఆర్థిక సాయం ప్రభుత్వం నుంచి అందదని తెలిపారు. కార్యక్రమంలో భీమిలి ఏవో బి.శివకోమలి, సురేష్, పొట్నూరు చంద్రశేఖర్, రాము, రైతు సేవా కేంద్రం సిబ్బంది తరపున ఎస్.కృపామణి తదితరులు పాల్గొన్నారు.



టి.నగరపాలెం రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి

కార్మికుల బకాయిల చెల్లింపులకు నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

20 వరకు గడువు

తగరపువలస: చిట్టివలస జ్యూట్ మిల్లు యాజమాన్యం నుంచి ఇప్పటి వరకు బకాయిలు తీసుకోని కార్మికుల కోసం బుధవారం నుంచి ఈ నెల 20 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇటీవల భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో అధికారులు, కార్మికసంఘాలు, మిల్లు యాజమాన్యం మధ్య జరిగిన చర్చల ఫలితంగా మిల్లు లేబర్ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఈ దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని పర్మినెంట్, బదిలీ, అప్రెంటిస్ కార్మికులు అందరికీ ఇది వర్తిస్తుంది. 2008 నుంచి 2019 జూలై 23 మధ్యలో మిల్లు కార్మికుడు మరణించి, ఇంతవరకు ప్రయోజనం పొందని జీవిత భాగస్వాములు మరణ ధ్రువీకరణ పత్రం, వేతన టిక్కెట్లు, ఈఎస్ఐ కార్డుతో సంప్రదిస్తే వారికి రూ.5వేలు వస్తాయి. యాజమాన్యం వద్ద ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసి దరఖాస్తు చేయని కార్మికులు, ఉద్యోగులు తగు ఆధారాలతో రావలసి ఉంటుంది. పీఎఫ్ గురించి దరఖాస్తు చేసుకోని వారు తగు ఆధారాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. క్వార్టర్స్‌లో ఉండి ఖాళీ చేసిన తరువాత విద్యుత్ మీటర్ సరెండర్ చేస్తే వారికి రూ.1000 వెనక్కు వస్తుంది. జీతం టిక్కెట్లలో చిన్న మార్పులు ఉన్నవారు కూడా వచ్చి తమ సమస్యలకు పరిష్కారం పొందాలని ఐక్య కార్మిక సంఘాల ప్రతినిధులు సూచించారు. ఎవరికి ఏ సందేహాలు ఉన్నా సంబంధిత కార్మిక సంఘం ద్వారా సాయం పొందవచ్చన్నారు.

తెరిపివ్వని వాన



వర్షంలో రోడ్డు దాటేందుకు అవస్థలు

మధురవాడ: మధురవాడ పరిసర ప్రాంతాలలో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఎడతెరిపి లేకుండా జడివాన కురిసింది. దీంతో జనం గొడుగులు, రెయిన్ కోట్లు వేసుకుని ప్రయాణించాల్సి వచ్చింది. దినసరి కూలీలు, వీధి వ్యాపారులు ఉపాధి లేక ఇబ్బంది పడ్డారు. రోడ్లు జలమయం కావడంతో వాహనచోదకులు, పాదచారులు అవస్థలు పడ్డారు.

బోసిపోయిన తీరప్రాంతం




వర్షంలో వడివడిగా..

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు ప్రాంతాలన్నీ మంగళవారం కురిసిన వానకు తడిసి ముద్దయ్యాయి. గాలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో తీర ప్రాంత మత్స్యకారులు వేటను విరమించుకున్నారు. తమ వలలను, పడవలను సురక్షితంగా తీరం వద్దకు చేర్చారు. పర్యాటక ప్రాంతాలైన రుషికొండ బీచ్, సాగర్‌నగర్ బీచ్ తొట్లకొండ, బావికొండ, మంగమారిపేట బీచ్, ఎర్రమట్టి దిబ్బలు, భీమిలి బీచ్ ప్రాంతాలన్నీ సందర్శకులు లేక వెలవెలబోయాయి. సాగర్‌నగర్‌లో పలు చోట్ల చెట్టు కొమ్మలు విద్యుత్ వైర్లపై పడ్డాయి.



ఉపాధి కోసం దినసరి కూలీల ఎదురుచూపులు



పర్యాటకులు లేక బోసిపోయిన రుషికొండ బీచ్